## కలుషిత నీటి సమస్యకు పరిష్కారం



మన్సూరాబాద్ ఓల్డ్ విలేజ్‌లో తాగునీటి కలుషిత సమస్యను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, జలమండలి జీఎం శ్రీనివాస్ రెడ్డి

మన్సూరాబాద్, మే 1: కలుషిత తాగునీటితో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని, వెంటనే జలమండలి అధికారులు సమస్యను పరిష్కరించాలని మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి చేసిన ఫిర్యాదుకు జలమండలి అధికారులు స్పందించారు. వారం రోజులుగా మన్సూరాబాద్ డివిజన్ పరిధి మన్సూరాబాద్ ఓల్డ్ విలేజ్, ముస్లిం బస్తీలలో వారం రోజులుగా తాగునీరు కలుషితం అవుతున్న విషయాన్ని మాజీ కార్పొరేటర్ ద్వారా తెలుసుకున్న జలమండలి జీఎం శ్రీనివాస్ రెడ్డి గురువారం సదర్ ప్రాంతానికి చేరుకొని సమస్యను పరిశీలించారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులకు మాజీ కార్పొరేటర్ విఠల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీల వాసులు పాల్గొన్నారు.

## యూజీడీ ట్రంక్ లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తా : కార్పొరేటర్



అంజలి రెసిడెన్సీలో యూజీడీ ట్రంక్ లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి

మన్సూరాబాద్, మే 8: యూజీడీ ట్రంక్ లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి కాలనీలలో మురుగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. డివిజన్ హయత్ నగర్ పరిధి అంజలి రెసిడెన్సీ కాలనీలో కొనసాగుతున్న యూజీడీ ట్రంక్ లైన్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం కొనసాగుతున్న ట్రంక్ లైన్ పనులు పూర్తయితే సుమారు 15 కాలనీల మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సోమనాథ్, రవీందర్ రెడ్డి, సుధాకర్ గౌడ్, మురళి, అమరేందర్ రెడ్డి, శంకర్ రెడ్డి, రామ్మోహన్‌రావు, శ్రీహరి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ ఆర్మీకి సహకరిస్తాం

**తెలంగాణ స్టేట్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బూడిద నందా రెడ్డి**



ఆపరేషన్ సింధూర్ చేపట్టడాన్ని హర్షిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

మన్సూరాబాద్, మే 8: పాకిస్తాన్ భారత్‌తో యుద్ధానికి దిగితే ఇండియన్ ఆర్మీకి మా లారీలతో ఉచిత సేవలు అందిస్తామని తెలంగాణ స్టేట్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బూడిద నందా రెడ్డి తెలిపారు. ఆపరేషన్ సింధూర్ చేపట్టి పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో గల తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై భారత త్రివిధ దళాలు ఏకకాలంలో దాడులు చేసి ఉగ్రవాదులను మట్టుబెట్టినందుకు తెలంగాణ రాష్ట్ర లారీ యజమానుల సంక్షేమ సంఘం తరపున హర్షం వ్యక్తం చేస్తూ గురువారం సాయంత్రం ఆటోనగర్ లోని గంగా జమున హోటల్ నుండి రాజధాని హోటల్ చౌరస్తా మీదుగా సుష్మ చౌరస్తా వరకు లారీ యజమానులందరూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నందా రెడ్డి మాట్లాడుతూ, తీవ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ మీద ఇలాంటి సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సింధూర్ లాంటి ఆపరేషన్స్ మరెన్నో నిర్వహించాలన్నారు. ఆపరేషన్ సింధూర్ చేపట్టిన భారత ప్రధానికి, జవాన్లకు ఎల్లవేళలా సహకరిస్తామన్నారు. పాక్ తో యుద్ధం వస్తే మా లారీలతో పూర్తిగా ఉచిత సేవలు అందించడానికి సంసిద్ధమై ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూడిద రాంరెడ్డి, ఆటోనగర్ ఇసుక లారీల యజమానుల సంఘం అధ్యక్షుడు సుర్వి రాజు గౌడ్, కొత్తపేట ఇసుక లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు నర్రి వెంకన్న, రాష్ట్ర నాయకులు కొండల్ రెడ్డి, అల్వాల్ రెడ్డి, ఆకుల శ్రీనివాస్, బచ్చనగోని జగదీష్ యాదవ్, వై జంగారెడ్డి, దేవనబోయిన మహేష్ యాదవ్, లగ్గొని శ్రీనివాస్ గౌడ్, సుర్వి రవిగౌడ్, గోధుమగడ్డ జంగారెడ్డి, సురుగురు మల్లారెడ్డి, అంతటి నరేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదంతో ప్రపంచానికి పెనుముప్పు



ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఆర్కే పురం, మే 8 : భారత సైన్యం ప్రదర్శించిన తన సైనిక పాటవానికి ప్రతి ఒక్క భారతీయుడు గర్విస్తున్నాడని బీజేపీ జాతీయ నాయకుడు పేరాల శేఖర్ జీ, ఏబీవీపీ జాతీయ మాజీ అధ్యక్షుడు మురళీ మనోహర్ అన్నారు. పాకిస్తాన్ చేస్తున్న పిరికి ఉగ్ర దాడులను తీవ్రంగా ఖండిస్తూ గురువారం ఆర్కే పురం డివిజన్ చిత్రాలేఅవుట్ కాలనీ నుండి రంగారెడ్డి కోర్టు వరకు ర్యాలీ నిర్వహించి బాణాసంచా కాల్చి పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉగ్రవాదులకు, దేశద్రోహులకు మన దేశంలో స్థానం లేదు, ఇకపై వారిని సహించేది లేదని పేర్కొన్నారు. ఉగ్రదాడికి ప్రతిచర్యగా మన భారతదేశ వివిధ దళాల సైన్యం చేసిన ఆపరేషన్ సింధూర్ పై గర్వపడుతూ మనందరి మద్దతు ఆశీర్వాదాలు మన భారత దేశ సైన్యానికి అందించాలని కోరారు. ఉగ్రవాదం, ఉన్మాదం ఏ రూపంలో ఉన్న ప్రపంచ మానవాళికి నష్టం కలుగుతుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరు ఉగ్రవాదం అంతం కోరుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ట ఉపేందర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, గణేష్, రామకృష్ణయ్య, సాయి, రఘు, సత్యనారాయణ రెడ్డి, కుసుమ, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కొంత మునికుంట నాలా పూడ్చివేత

బడంగ్ పేట్, మే 8: బాలాపూర్ మండల పరిధిలో ఉన్న కొంత మునికుంటకు వచ్చే నాలాను పూర్తిగా మట్టితో పూడ్చి వేస్తున్నారని బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవికి బాబు జగ్జీవన్‌రామ్ యువజన సంఘం నాయకులు శ్రీరాములు, ఉమేష్, యాదయ్య, తిమ్మని గిరీష్ ఫిర్యాదు చేశారు. 272, 273, 275, 276, 277, 278, 281 సర్వే నెంబర్ల పరిధిలో ఉన్న నాలాను పూర్తిగా పూడ్చి చేశారని వారు తహసీల్దార్‌కు వివరించారు. చెరువు పక్కనే ఉన్న అగ్రికల్చర్ ల్యాండ్‌ను ల్యాండ్ కన్వర్షన్ చేయకుండానే అక్రమ వెంచర్ చేశారని వారు ఆరోపించారు. నాలాలో మట్టి పోసి పూర్తిగా పూడ్చి వేయించారన్నారు. కొంత మునికుంటను సైతం కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. గతంలో అనేకమార్లు ఈ గుంటను కబ్జా చేయడానికి కబ్జాదారులు చాలా సార్లు ప్రయత్నం చేసి విఫలమయ్యారని తహసీల్దార్‌కు తెలియజేశారు. ఎలాగైనా చెరువును రక్షించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## మాజీ ఎమ్మెల్యే బండారు రాజిరెడ్డి మృతి తీరని లోటు



ఎమ్మెల్యే బండారు రాజిరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సామ రమణారెడ్డి

చంపాపేట, మే 8: ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారు రాజిరెడ్డి మరణం నియోజకవర్గ ప్రజలకు తీరని లోటు అని చంపాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి అన్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే రాజిరెడ్డి మరణించారన్న విషయం తెలుసుకున్న సామ రమణా రెడ్డి అక్కడికి చేరుకుని ఆయన భౌతికకాయం పై పూల మాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యే రాజిరెడ్డి భౌతికంగా నియోజకవర్గ ప్రజల మధ్య లేకపోయినా ఆయన చేసిన సేవలను నియోజకవర్గ ప్రజలు ఎప్పటికీ మరిచిపోరన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం కృషి చేశారని గుర్తు చేశారు. నిస్వార్థంగా సేవలు అందించి ప్రజల నుండి మంచి పేరు సంపాదించారని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## హరిదాస్‌పల్లి, కీసరదాయరలో 118 ఫిర్యాదులు



రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు అందజేస్తున్న స్థానికులు

కీసర : గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను భూ భారతి ద్వారా పరిష్కారం చేస్తామని ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి తెలిపారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ, కీసరదాయర, హరిదాస్‌పల్లి గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. కీసరదాయరలో 97, హరిదాస్‌పల్లిలో 19 మొత్తం 118 ఫిర్యాదులు వచ్చాయి. ఆర్డీవో మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారానికి కొత్త ఆర్‌ఓఆర్ చట్టంతో పరిష్కారం చేస్తామన్నారు. ప్రజల్లో నెలకొన్న భయాందోళనలకు విముక్తి కల్గించడానికి వివరాలు పూర్తిగా తెలుపుతామన్నారు. సాదా బైనామా, సీలింగ్, మ్యూటేషన్, ఇనాం, రికార్డ్ మార్పు, సవవరణ సమస్యలు నెలకొన్నాయని, వీటిని 15 రోజుల్లో పరిష్కారం చేస్తామన్నారు. రెవెన్యూ పరంగా సమస్యలున్న భూ భారతి ద్వారా వాటిని పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి'



భీమ్‌రెడ్డి రామ్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ప్రణవీగౌడ్, తదితరులు

కందుకూరు, మే 8 : ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని ఎస్‌టీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి గౌడ్ తెలిపారు. మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన భీమ్‌రెడ్డి రామ్‌రెడ్డి ఎక్సైజ్ సీఐగా పదవీ విరమణ పొందడంతో అభిమానులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, లయన్స్ క్లబ్ సభ్యులు, ఎక్సైజ్ సిబ్బంది సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామ్‌రెడ్డితో పాటు భార్య వనితను శాలువాలు పూలదండలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రణవిగౌడ్ మాట్లాడుతూ. ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి ఒక్కరి మన్ననలను పొందాలని సూచించారు. ప్రజలకు సేవ చేసే అదృష్టం కల్పించినందుకు భగవంతుడు కల్పించిన గొప్ప అవకాశం అని తెలిపారు. ప్రజలకు సేవ చేస్తే జీవితాంతం గుర్తింపుగా ఉంటారని వివరించారు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ విధులను సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు .శేష జీవితాన్ని భార్యా పిల్లలు, కుటుంబ సభ్యులతో సుఖశాంతులతో గడపాలని కోరారు. ఎస్‌టీఎఫ్ డీపీ ఈఓ ఆగి రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఏసీ కిషన్ రావు, బ్రవరీస్ ఏసీ చంద్రయ్య, వికారాబాద్ జిల్లా డీపీ ఈఓ విజయభాస్కర్, రిటైర్డ్ ఏసీ గోవిందు, నరసింహులు, రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ గంగాపురం చెన్న కిషన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగాపురం లక్ష్మీ నరసింహ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచకూరి వెంకటేశ్వర్లు గుప్తా, మాజీ ఎంపీటీసీ వట్నాల ఈశ్వర్ గౌడ్, మాజీ సర్పంచ్ పున్న భిక్షపతి, సాద మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కరాటే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి



చర్లపల్లి : కరాటే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ సూచించారు. చైతన్యనగర్ డబుల్ బెడ్‌రూం డిగ్నిటీ కాలనీలో భవాని షోటోకాన్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు, గ్రాండ్‌మాస్టర్ పృథ్వీ కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు గుండారపు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కార్పొరేటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు డీసీఎం రాజు, కాలనీ నాయకులు బోడ నరేష్, రమేష్, విద్యాసాగర్, సీతామహాలక్ష్మి, పాల్‌రాజు, మహేశ్, ప్రభాకర్, చందు, కుమార్, లక్ష్మి, భారతి, మూర్తి, వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులు కాలరాస్తే ఊరుకోం



బాలాపూర్ చౌరస్తాలో సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు



లేమూరులో వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న బాలరాజ్, ఆశ వర్కర్లు



దేశవ్యాప్త కార్మిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

బడంగ్‌పేట్, మే 8: బాలాపూర్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో జాతీయ సార్వత్రిక కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మికుల హక్కులను కాలరాసే ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. కార్మికుల హక్కులను కార్పొరేట్ వ్యవస్థకు కట్టబెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు దాసరి బాబు, శేఖర్ యాదవ్, యాదగిరి, నరేందర్, కృష్ణ బన్నీ, రాజేష్, దేవి, తదితరులు ఉన్నారు.

కందుకూరు , మే 8: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం మండల పరిధిలోని లేమూరు గ్రామంలో వాల్ పోస్టర్‌ను సీఐటీయూ కార్యదర్శి బుట్టి బాలరాజ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలరాజ్ మాట్లాడుతూ, నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులపై పని భారాన్ని మోపుతూ, వేతనాలు పెంచకుండా కార్మికుల 29 చట్టాలను నిర్వీర్యం చేస్తున్నట్లు తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండే చట్టాలను తీసుకువచ్చి కార్మికుల బ్రతుకులతో చెలగాటం ఆడుతోందన్నారు .ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యోగ భద్రత కోసం దేశవ్యాప్తంగా 20 తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మహేశ్వరం మండల కన్వీనర్ శేఖర్, ఆశ వర్కర్లు సుశీల, సంధ్య, పోచమ్మ, లక్ష్మమ్మ, భారతి, చంద్రకళ పాల్గొన్నారు.

మన్సూరాబాద్, మే 8: పాలకవర్గాలు కార్మిక వర్గాన్ని లేబర్ కోడ్ లతో పారిశ్రామికవేత్తలకు బానిసలుగా మారుస్తున్నారని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ అన్నారు. ఈనెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను గురువారం మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తక్షణమే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి గతంలో ఉన్న 29 లేబర్ చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, నాయకులు సీహెచ్ కృష్ణయ్య, ఎం. నరహరి, వెంకటమ్మ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఫార్మసీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంఫార్మసీ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్షలను వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

### స్పీచ్ అండ్ హియరింగ్ డిసేబులిటీస్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అలీ యావర్ జంగ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిసేబులిటీస్‌లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈ కేంద్రం 2025-26 విద్యా సంవత్సరానికి బీఏఎస్ఎల్పీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (హెచ్ఐ), ఎంఎస్సీ (ఆడియాలజీ) కోర్సులతోపాటు డిప్లొమా స్థాయి కోర్సులను సైతం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు వచ్చేనెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాలను ప్రవేశపరీక్షలో ప్రతిభ ఆధారంగా నిర్వహిస్తామని వివరించారు. ఇతర వివరాలకు www.ayjnishd.nic.inలో చూసుకోవాలని పేర్కొన్నారు.

### పలు కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లమో ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలతో పాటు ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కోర్సు సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

### ఎంపీఈడీ పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంపీఈడీ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపరు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## అనుమతి లేని క్లినిక్స్‌పై చట్టపరమైన చర్యలు




అల్వాల్‌లో అనుమతి లేకుండా నడుస్తున్న క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

మల్కాజిగిరి, మే 8: ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుస్తున్న క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్ సెంటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ కీసర డివిజన్ డాక్టర్ సత్యవతి అన్నారు. గురువారం అల్వాల్ పరిధిలో అకస్మాత్తుగా అధికారులు తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న గౌరవి పాలిక్లినిక్, భువన డయాగ్నొస్టిక్ సెంటర్‌ను సీజ్ చేశారు. కార్యక్రమంలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గీత పాల్గొన్నారు.

## పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలి

**కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి**

సైదాబాద్, మే 8: సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఉద్యానవనాలలో పచ్చదనం, వాకింగ్ ట్రాక్స్ స్థానికుల అవసరాల మేరకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్ రెడ్డి అన్నారు. గురువారం బి బ్లాక్ లోని పార్కులో జీహెచ్ఎంసీ చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ సునంద రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రఘునాథరెడ్డి, సర్కిల్ మేనేజర్లు కిరణ్, యమున, తదితరులతో కలిసి ఆమె పార్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాలనీ వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణ అందించటం కోసం పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## డేవిడ్ ఫ్రాన్సిస్‌కు బంగారు పతకాలు



నేరేడ్‌మెట్ : ఇండో నేపాల్ రంగశాల స్టేడియం వేదికగా జరుగుతున్న సౌత్ ఏషియన్ ఇంటర్నేషనల్ క్రీడా విభాగాల్లో డేవిడ్ ఫ్రాన్సిస్ 3 బంగారు పతకాలు సాధించాడు. ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు 74 ఏండ్ల విభాగంలో సికింద్రాబాద్ యాప్రాల్‌కు చెందిన డేవిడ్ ఫ్రాన్సిస్ లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రోలో పతకాలు సాధించాడు. ఫ్రాన్సిస్‌ను యాప్రాల్, కాప్రా డివిజన్ క్రీడాకారులు, స్థానికులు అభినందించారు

## నేడు డయల్ యువర్ డీఎం

మేడ్చల్ : ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు, సమస్యల సత్వర పరిష్కారానికి శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు మేడ్చల్ డీఎం సుధాకర్ తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. వినియోగదారులు 9959226152 నంబర్‌కు ఫోన్ చేసి, సమస్యలను తెలుపాలని, సూచనలు చేయాలని ఆయన కోరారు.

## ఆరోగ్య శిబిరానికి విశేషస్పందన

మేడ్చల్ : మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో గురువారం సీఎంఆర్ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 100 మందికి వైద్య నిపుణులు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి మెరుగైన చికిత్స కోసం సీఎంఆర్ దవాఖానకు రావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఉమానాగరాజు, సీఎంఆర్ పీఆర్వో దుర్గాప్రసాద్ రెడ్డి, మహేందర్, రాజశేఖర్ రెడ్డి, సరోజ, జ్యోతి పాల్గొన్నారు.